క్లుప్తంగా

నేడు ఆలయ ప్రథమ వార్షికోత్సవం

నాగలాపురం: పిచ్చాటూరు మండలం రజాన నగరం(కొత్తపేట) గ్రామంలోని పాలమునీశ్వర స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం 6 గంటలకు గణపతి పూజతో ప్రారంభించి సెల్వ గణపతి హోమం, బాల త్రిపుర సుందరి హోమం, పాలమునీశ్వర స్వామికి మూల మంత్ర హోమం, మహాభిషేక పూర్ణాహుతి, మహాదీపారాధాన జరుగుతుందన్నారు. సాయంత్రం బాల త్రిపుర సుందరి అమ్మవారికి చందన కాపు లలిత సహస్రనామ అర్చన నిర్వహించనున్నట్లు తెలిపారు.

వెన్నుపోటు దినంపై నేడు సమీక్ష

శ్రీకాళహస్తి: పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం జూన్ 4న తలపెట్టనున్న వెన్నుపోటు దినంపై సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయం తెలిపింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరుపతి జిల్లా పార్లమెంటు పరిశీలకులు మేడ రఘునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హాజరు కానున్నట్లు పేర్కొంది.

రేషన్ దుకాణాల తనిఖీ


రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీఓ

శ్రీకాళహస్తి: పట్టణంలోని పలు రేషన్ దుకాణాలను ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ ఉన్న రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రేషన్‌పంపిణీలో ఎలాంటి అవకతవకలకు పాల్పడకూడదన్నారు. అలా పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

చెంగంబాకం మాజీ సర్పంచ్‌పై కేసు నమోదు

వరదయ్యపాళెం: వివాహితతో అసభ్యంగా ప్రవర్తించిన చెంగంబాకం మాజీ సర్పంచ్ మునికృష్ణయ్యపై శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. చెంగంబాకం గ్రామానికి చెందిన ఓ వివాహితతో మాజీ సర్పంచ్ అసభ్యకరంగా మాట్లాడడం, తన కోర్కె తీర్చమని ఆమెపై ఒత్తిడి తేవడంతో తీవ్ర మనస్తాపానికి చెందిన మహిళ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణ చేపట్టి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

దేవాంగ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు


ప్రతిభ పురస్కారాలు అందజేస్తున్న దేవాంగ సంఘం నేతలు

వరదయ్యపాళెం: మండలంలోని కారిపాకం, బీఎస్‌పేట గ్రామాల్లో ఇంటర్, పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన దేవాంగ విద్యార్థులకు నెల్లూరు జిల్లా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా కారిపాకం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని పృథ్వీ దేవిశ్రీ (983), గట్టు ఉదయ్‌కిరణ్ (912), బీఎస్‌పేటకు చెందిన పదో తరగతి విద్యార్థి మాచర్ల హేమసాయి (540) సాధించారు. వీరికి రాష్ట్ర దేవాంగ సంఘం నాయకులు గుత్తి త్యాగరాజు, మన్నెముద్దు శ్రీనివాసులు, నెల్లూరు జిల్లా దేవాంగ సంఘం అధ్యక్షుడు డాక్టర్ మన్నెం సతీష్ నగదు బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

మా పోరాటానికి సంఘీభావం తెలపండి

శ్రీకాళహస్తి: తమపోరాటానికి సంఘీభావం తెలపాలని శుక్రవారం ఎస్సీవీ నాయుడిని ఉచిత సేవకులు కోరారు. ఆదివారం ఆయన్ని కలిసి వారు విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పాలక మండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులును తమకు జీతభత్యాలు ఏర్పాటు చేయాలని కోరగా ట్రస్టు బోర్డు సమావేశంలో ఈ అంశాన్ని పొందుపరచి ఏకగ్రీవ తీర్మానం చేశారన్నారు. జీతభత్యాలు ఇచ్చేందుకు దేవాదాయశాఖ కమిషనర్ కూడా దక్షిణామూర్తి ఏజెన్సీ ద్వారా జీతాలు ఇచ్చేందుకు అనుమతి ఇచ్చారని తెలిపారు. ఎన్నో ఏళ్లగా ఉచితంగా పని చేసిన తమకు జీతాలు వస్తే ఇప్పుడు తమ ఆర్డర్ కాపీ ద్వారా తమ పేర్లను కాకుండా కొత్త వారిని చేర్చి, తమను అన్యాయంగా పక్కన పెట్టారన్నారు. అశోక్, రంగయ్య, వంశీ, తులసీరామ్, దామోదరం, గోపి, మునిబాబు, మాధవయ్య పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

రేణిగుంట: మండలంలోని గురవరాజుపల్లి వద్ద గత ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన స్కూటరిస్ట్ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు గాజులమండ్యం ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు. తొట్టంబేడు మండలం కనపర్తికి చెందిన వెంకటాద్రి (48) ద్విచక్ర వాహనంపై వెళుతూ అదుపుతప్పి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఆయన పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలకు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఈ భారం మోయలేకున్నాం.. బాబూ!

- పనిచేయని సర్వర్లు
- మొదలైన రేషన్ కష్టాలు
- రేషన్ షాపుల వద్ద క్యూ కట్టిన లబ్ధిదారులు
- రేణిగుంటలో షాపుల వద్ద టీడీపీ కార్యకర్తల హడావుడి

పేదలకు మళ్లీ రేషన్ కష్టాలు మొదలయ్యాయి. ఎండీయూ వాహనాల రద్దు, రేషన్‌షాపుల వద్ద సరుకుల పంపిణీతో కార్డుదారులు ఇక్కట్లు పడ్డారు. ఆదివారం సత్యవేడు నియోజకవర్గ వ్యాప్తంగా కార్డుదారులు రేషన్ సరుకులు తెచ్చుకోవడానికి పడిన కష్టాలు వర్ణనాతీతం. సుదూరంలోని షాపుల నుంచి నెత్తిన సరుకులు మోసుకుని రావడానికి ఇక్కట్లు పడ్డారు. ఈ భారం మోయలేకున్నాం బాబూ అని నిట్టూర్చారు.



గాంధీ వీధిలో రేషన్ షాపు వద్ద క్యూలో వేచి ఉన్న వృద్ధులు, మహిళలు, వెంకటాపురంలో రేషన్ బియ్యాన్ని మోసుకు వెళుతున్న మహిళ

నాగలాపురం: మండలంలో రేషన్ కార్డుదారులు సరుకులు తీసుకోవడానికి ఇక్కట్లు పడ్డారు. అలివికానీ హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలకు ఒక్కటంటే ఒక్క మంచి పని కూడా చేయలేదు. పైగా ప్రజలకు అనుకూలంగా ఉన్న పథకాలను తుంగలో తొక్కుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలు శ్రేయస్సు కోరి అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలను రద్దు చేస్తూ ప్రజలను క్షోభ పెడుతోంది. గతంలో ప్రజల ముంగిటకే రేషన్ సరుకులు తీసుకువచ్చిన ఎండీయూ వాహనాలను రద్దు చేసింది. దీంతో ప్రజలు పనులు మానుకుని మళ్లీ రేషన్ షాపుల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. నాగలాపురంలోని గాంధీ వీధిలో ఉన్న ఓ రేషన్ షాపు వద్ద వృద్ధులు, మహిళలు ఉదయం నుంచి పడిగాపులు కాశారు. సర్వర్ సమస్యతో మండు టెండలో వేచి ఉండలేక ఇబ్బందులు పడ్డారు. గత ఐదేళ్లు తమకు ఎలాంటి కష్టం లేకుండా ఇంటి వద్దనే రేషన్ తీసుకునే వారమని, ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా పోయిందని, ఇంకా ఎన్ని కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందోనని ఆవేదన చెందుతున్నారు.

ఇబ్బందుల్లో రేషన్ కార్డుదారులు

బుచ్చినాయుడుకండ్రిగ: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల ఇంటి ముంగిటకే వాహనాల ద్వారా నిత్యావసర వస్తువులను అందజేయడంతో రేషన్ దుకాణాల ముందు క్యూలో నిలబడాల్సిన పని ఉండేది కాదు. కూటమి ప్రభుత్వం ఇంటింటికీ బియ్యం పంపిణీ వ్యవస్థకు మంగళం పాడింది. దీంతో కార్డుదారులు మళ్లీ రేషన్ సరుకుల కోసం క్యూలో వేచి ఉండాల్సిన దుస్థితి దాపురించిందని కార్డుదారులు వాపోయారు. కొన్ని గ్రామాల్లో రెండు, మూడు కిలోమీటర్లు దూరంలో రేషన్ దుకాణాలుండటంతో కార్డుదారులు ఇబ్బంది పడుతున్నారు. కాగా మండలంలోని 28 రేషన్‌షాపుల్లో ఆదివారం నిత్యావసర సరుకుల పంపిణీ ప్రారంభించినట్లు తహసీల్దార్ శ్రీదేవి తెలిపారు.

రేషన్ షాపుల వద్ద ప్రజల పడిగాపులు

రేణిగుంట: గత ఐదేళ్లు ప్రశాంతంగా ఇంటి వద్దే రేషన్ సరుకులు తీసుకుంటున్న ప్రజలు కూటమి ప్రభుత్వ దెబ్బకు రేషన్ షాప్‌ల వద్ద పడిగాపులు కాస్తున్నారు. రేణిగుంట మండలంలో సుమారు 21,500 రేషన్ కార్డులు ఉన్నాయి. 110 గ్రామాలకు గాను 44 రేషన్ షాపులున్నాయి. ఆదివారం ఉదయం నుంచి రేషన్ షాపుల ముందు మహిళలు వేచి ఉన్న సంఘటనలు కనిపించాయి. సర్వర్లు పనిచేయకపోవడంతో రేషన్ పంపిణీ నెమ్మదిగా సాగింది. 65 ఏళ్ల పైబడిన వారికి ఇంటి వద్ద రేషన్ బియ్యం సరఫరా చేస్తామని ప్రకటించారు గానీ, వృద్ధులు సైతం రేషన్ షాపుల వద్ద క్యూలో నిల్చున్నారు. పాంచాలి నగర్‌లోని రేషన్ షాపు సర్వర్ పనిచేయకపోవడంతో ఉదయం 10 గంటలకు మూసివేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో రేషన్ బియ్యాన్ని తీసుకుని వెళ్లేందుకు మహిళలు ఇబ్బందులు పడ్డారు. సర్వర్లు పనిచేయకపోవడంతో చాలామంది ప్రజలు వెనుతిరిగి వెళ్లారు. డీలర్లను ప్రశ్నించగా సర్వర్లు పనిచేయకపోతే తామేమీ చేయలేమని, 15 రోజులు ఇస్తామని, మీరు ఎప్పుడైనా వచ్చి తీసుకోవచ్చని నిర్లక్ష్యం సమాధానం చెబుతున్నట్లు కార్డుదారులు వాపోతున్నారు. మొదటి రోజు రేషన్ సరుకుల పంపిణీలో స్థానిక టీడీపీ కార్యకర్తల హడావుడి ఎక్కువగా కనిపించింది.

పనిచేయని సర్వర్లు

తొట్టంబేడు: మండలంలో చాలా చోట్ల సర్వర్లు పని చేయక ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. రేషన్ దుకాణానికి వచ్చినా సర్వర్లు పనిచేయకపోవడంతో వేచి చూసి వెళ్లిపోయారు. బసవయ్యపాళెం, కల్లిపూడిరేషన్ దుకాణం వద్ద మహిళలు వేచ్చి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. తాటిపర్తి పంచాయతీ కల్లిపూడి గ్రామంలో రేషన్ దుకాణం ఉండడంతో మల్లిగుంట, తాటిపర్తి గ్రామాలకు చెందిన ప్రజలు రెండున్నర కిలోమీటర్లు ప్రయాణం చేసి రేషన్‌షాపునకు రావాల్సి వచ్చింది. గతంలో వ్యాన్లు ఆయా గ్రామాలకు తీసుకువెళ్లి ఇచ్చే అవకాశం ఉండేది. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. తాటిపర్తి, మల్లిగుంట గ్రామస్తులు కల్లిపూడికి పోవాలంటే కష్టమని తమ గ్రామాల్లో రేషన్ అవుట్ లెట్ ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నారు.


బ్రాహ్మణ వీధిలో కార్డుదారుల పడిగాపులు


రేణిగుంట పాంచాలి నగర్‌లో సర్వర్ పని చేయకపోవడంతో మూసి వేసి రేషన్ షాపు



రేణిగుంటలో రేషన్ షాపుల వద్ద వేచి ఉన్న మహిళలు


బసవయ్యపాళెం రేషన్ దుకాణం వద్ద సరుకుల కోసం వేచి ఉన్న ప్రజలు

అన్ని వర్గాల ప్రజలకు అన్యాయమే


వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరిస్తున్న నూకతోటి రాజేష్ , నాయకులు

నారాయణవనం: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయమే జరుగుతోందని, కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పరచకుండా మోసం చేస్తోందని వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ నూకతోటి రాజేష్ అన్నారు. ఆదివారం సాయంత్రం బైపాస్ వైఎస్సార్ సర్కిల్ వద్ద పార్టీ నాయకులతో కలిసి వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాజేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది అవుతోందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వైఎస్సార్‌సీపీ నాయకులను టార్గెట్‌గా పెట్టుకుని అక్రమ కేసులు, అరెస్టులతో కాలం వెళ్లదీస్తోందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలనను ప్రజలందరూ గమనిస్తూనే ఉన్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అన్యాయమే జరుగుతోందన్నారు. నిరుద్యోగులు, ఉద్యోగులు, రైతులకు న్యాయం జరగడం లేదని తెలిపారు. ఏడాది కాలంలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. నాయకులు, కార్యకర్తలను భయ భ్రాంతులకు గురిచేస్తూ సాగిస్తున్న అరాచకపాలనపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు జూన్ 4వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. మోసపోయిన ప్రజలను జాగృతి చేయడం కోసం వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం వరదయ్యపాళెంలో వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాజేష్ తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు వరదయ్యపాళెం వైఎస్సార్ సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీని నిర్వహించిన అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ సొరకాయలు, ఎంపీపీ దివాకర్ రెడ్డి, వైఎస్ ఎంపీపీ శివశంకర్, రాష్ట్ర వాణిజ్య విభాగం సంయుక్త కార్యదర్శి అన్నాదొరై, జిల్లా కార్యవర్గ కార్యదర్శి రాకేష్ కిరణ్, ఎంపీటీసీ సభ్యుడు రవి, నాయకులు దొరైరాజ్, అశోక్, పీజీ బాబు, మంజునాథ్, చీరాలయ్య, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'వెన్నుపోటు దినం' విజయవంతం చేయండి


బుచ్చినాయుడుకండ్రిగలో కరపత్రాలతో నేతలు

బుచ్చినాయుడుకండ్రిగ: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జూన్ 4 వ తేదీన వరదయ్యపాళెంలో జరగనున్న వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొణతనేని మణినాయుడు కోరారు. ఆయన ఆదివారం బుచ్చినాయుడుకండ్రిగలోని పార్టీ కార్యాలయంలో నాయకులతో, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి, వెన్నుపోటు దినం కరపత్రాలను ఆవిష్కరించి, ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది అవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేయడాన్ని నిరసిస్తూ వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 4వ తేదీ ఉదయం 9 గంటలకు వరదయ్యపాళెంలో జరుగుతుందని, మండలంలోని అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొని, జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్టేట్ గ్రీవెన్స్ సెల్ కార్యదర్శి సాయినాయుడు, స్టేట్ ఎస్సీ సెల్ కార్యదర్శి ఉగ్గమూడి గురునాథం, నాయకులు జయచంద్రనాయుడు, సముద్రాల అశోక్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ద్రౌపదీ, ధర్మరాజుల ఊరేగింపు


ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురంలో ఉన్న శ్రీకృష్ణ, ద్రౌపది సమేత ధర్మరాజుల స్వామివారి ఆలయంలో జరుగుతున్న 51వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి అమ్మవార్లను ఘనంగా ఊరేగించారు. మేళ, తాళాలు, బాణసంచా వేడుకల మధ్య ఊరేగింపు సాగింది. గ్రామంలో మహిళలు ఉత్సవమూర్తులకు హారతులిచ్చి, మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 3వ తేదీన మంగళవారం ద్రౌపదీదేవి కల్యాణం, 6వ తేదీ అర్జున తపస్సుమాను, 7వ తేదీ శనివారం అలుగు నిల్చుట, 8వ తేదీ ఆదివారం అగ్నిగుండ ప్రవేశం, 9వ తేదీ సోమవారం వసంతోత్సవం, ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగుస్తాయి. ఈ కార్యక్రమంలో పూజారి రవి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అసంపూర్తిగా కాంబాకం రోడ్డు


కంకర తేలిన దారి

వరదయ్యపాళెం: మండలంలోని వరదయ్యపాళెం నుంచి కాంబాకం వెళ్లే రోడ్డు అసంపూర్తిగా మిగిలిపోయింది. గతంలో ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ అటవీశాఖ అభ్యంతరం మేరకు పనులు నిలిచిపోయాయి. అనుమతులు వచ్చే సమయానికి మంజూరైన నిధులు తక్కువ కావడంతో పనులు మొదలు కాలేదు. కంకర తేలిన రోడ్డుపై స్థానికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా వాహనదారులు కొన్ని సందర్భాల్లో ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రభుత్వం స్పందించి నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది.

పాండూరు హైస్కూల్ హెచ్‌ఎంగా మునిసుబ్రమణ్యం

వరదయ్యపాళెం: మండలంలోని పాండూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులుగా మునిసుబ్రమణ్యం ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నాగలాపురం మండలం వేంబాకం హైస్కూల్ నుంచి బదిలీపై ఇక్కడికి రాగా ఇక్కడ పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు విమలకుమారి సత్యవేడు మండలం మదనంబేడు హైస్కూల్‌కు బదిలీ అయినట్లు తెలిపారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు ఆయన్ని సత్కరించి, అభినందనలు తెలిపారు.

శ్రీకాళహస్తి జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎంగా తీగల వెంకటయ్య

శ్రీకాళహస్తి ఆర్‌పీబీఎస్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా తీగల వెంకటయ్య ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. శాంతిపురం మండలం సెట్టిపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా శ్రీకాళహస్తికి బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరణ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఎంఈఓ బాలయ్య, ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి, పలువురు ఉపాధ్యాయులు వెంకటయ్యకు శుభాకాంక్షలు తెలిపారు. కాగా ఇక్కడ పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి రామచంద్రపురం మండలం పరమాలకు బదిలీ అయ్యారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు


కార్డన్ సెర్చ్ చేస్తున్న పోలీసులు

శ్రీకాళహస్తి: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని శ్రీకాళహస్తి ఒకటో పట్టణ సీఐ గోపి అన్నారు. పట్టణంలోని తుపాన్ సెంటర్‌లో ఆదివారం ఉదయం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. అందులో భాగంగా సరైన పత్రాలు లేని 9 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రాంతంలోఎవరూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకూడన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలను తమ వద్ద ఉంచుకోవాలన్నారు. సారా తయారీ, గంజాయి విక్రయం చేయకూడదని సూచించారు. వారికి చట్టాలపై అవగాహన కల్పించారు.

వైభవంగా మారెమ్మ జాతర


అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి

- అమ్మవారి సేవలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి

రేణిగుంట: మండలంలోని తూకివాకం పంచాయతీ ఎస్‌ఆర్ పట్టెడ గ్రామదేవత మారెమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున అమ్మవారికి విశేష అభిషేకాలు చేసి, శోభాయమానంగా అలంకరించారు. భక్తులు పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు మాజీ ఎమ్మెల్యేని ఘనంగా సత్కరించి, తీర్థప్రసాదాలను అందజేశారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు తిరుమల రెడ్డి, ఎంపీపీ హరిప్రసాద్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సంధ్య రాణి, సర్పంచ్ మునిశేఖర్, శేఖర్ బాబు, గంగయ్య, చంద్ర,ముని శేఖర్, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, పళణి, శ్రీను, ఎంపీటీసీ సభ్యులు ఆనంద రావు, ముని రెడ్డి, ధనంజేయులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన


రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్

నాగలాపురం: మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. పెళ్లకూరు చాగణం లలితమ్మ, భాస్కరరావు మెమోరియల్ ట్రస్టు సౌజన్యంతో తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర అరవింద నేత్రాలయ ఆధ్వర్యంలో పట్టణంలోని స్థానిక సాయిబాబా మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మేనేజింగ్ ట్రస్టీ చాగణం గౌరీ శంకర్, సీఈఓ సీతారామ నాయుడు పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరంలో రోగులకు వైద్య నిపుణులు 235 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి 70 మందికి మందులు, 45 మందికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. 75 మందిని ఉచితంగా ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ట్రస్టు ఏఓ కృష్ణ, అరవింద్ నేత్రాలయ సిబ్బంది గౌరీ శంకర్ పాల్గొన్నారు. జగదీష్‌రెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బదిలీల అవకాశం కల్పించండి

శ్రీకాళహస్తి: రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో పని చేసేలా బదిలీల ద్వారా అందరికీ అవకాశం కల్పించాలని బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర పురోహిత విభాగం కార్యదర్శి సింగరాజు బాలసుబ్రమణ్య శాస్త్రి కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంతో పురాణ ప్రాచుర్యం కలిగిన దేవాలయాలు ఎన్నో ఉన్నాయన్నారు. వాటిలో ఒక్కొక్క దేవాలయానికి ఒక్కొక్క సంప్రదాయంలో పూజలు జరుపుతున్నారన్నారు. ఈ క్రమంలో అర్చకులు పరిచారకులుగా ఆయా దేవాలయాలకు నియమించిన వారిని మరో దేవాలయానికి బదిలీ చేయడానికి అవకాశం ఉండదన్నారు. కానీ దేవాలయంలో వేద పారాయణం చేసే వేద పండితులు ఏ దేవాలయంలో అయినా వేద పారాయణానికి నియమిస్తారన్నారు. అలాంటి వారికి ఇతర ప్రభుత్వ శాఖలలో పనిచేసే ఉద్యోగుల మాదిరిగా వర్తించే బదిలీ నియమాలు వారికి వర్తించకపోవడం చాలా హాస్యాస్పదంగా ఉందన్నారు. డిప్యూటేషన్ ఒక దేవాలయంలో జీతభత్యాలు ఇవ్వలేని పరిస్థితిలో మరో దేవాలయానికి బదిలీ చేస్తున్న దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈ విషయాన్ని ఎందుకు ఆలోచించడం లేదని ప్రశ్నించారు.

మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కర్మక్రియలకు మాజీ ఎమ్మెల్యే హాజరు

శ్రీకాళహస్తి: పట్టణంలోని బహదూరుపేటలో ఆదివారం జరిగిన మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కళత్తూరు మునిరాజా కర్మక్రియలకు శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హాజరయ్యా రు. మునిరాజా చిత్రపటం వద్ద నివాళులర్పించా రు. అంజూరు తారక శ్రీనివాసులు, పాలమంగళం శివ, కల్యాణి, ప్రకాష్, సాధనమున్నా రాయ ల్, సురేష్, కంఠా ఉదయ్‌కుమార్ మధురెడ్డి, కృష్ణ, విజయకుమార్‌రెడ్డి, జైకృష్ణారెడ్డి ఉన్నారు.

ప్రెస్‌క్లబ్‌కు మంచి పేరు తేవాలి

శ్రీకాళహస్తి: ప్రెస్‌క్లబ్‌కు మంచి పేరు తీసుకువచ్చేలా సభ్యులందరూ వ్యవహరించాలని ఆ క్లబ్ అధ్యక్షుడు ఎం వేణుగోపాల్ కోరారు. శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్‌లో ఆ క్లబ్ అధ్యక్షుడు ఎం వేణుగోపాల్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రెస్ క్లబ్ నిబంధనలపై చర్చించారు. ముఖ్యంగా శ్రీకాళహస్తి ప్రెస్‌క్లబ్ సభ్యులందరూ ప్రెస్ క్లబ్‌కు మంచి పేరు తీసుకొచ్చేలా వ్యవహరించాలని తెలిపారు. అనంతరం శ్రీకాళహస్తి ప్రెస్‌క్లబ్‌కు శాశ్వత భవన నిర్మాణానికి నిధుల కోసం ప్రభుత్వం, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. అలాగే శ్రీ కాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానంలో పీఆర్వో వ్యవస్థను కూడా ప్రక్షాళన చేయాలని ఈఓను కోరుతున్నట్లు సభ్యులు తెలిపారు.

గౌరవాధ్యక్షుడు చంద్రయ్య మాట్లాడుతూ ప్రెస్‌క్లబ్ సభ్యులందరూ నిబంధనలు పాటించాలని జర్నలిజం కాపాడుకునేలా అందరం పని చేయాలని తెలిపారు. అనంతరం వార్త రిపోర్టర్ మెహర్ కుమార్ మృతికి ప్రెస్‌క్లబ్ సభ్యులు సంతాపం తెలిపారు. అనంతరం శ్రీకాళహస్తి ప్రెస్‌క్లబ్ తరపున మెహర్‌కుమార్ కుటుంబానికి రూ.27,500 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కార్తీక్ నాయుడు, పీఆర్వో ఈశ్వర్, పరిటాల తదితరులు పాల్గొన్నారు.